# స్నేహమంటే...

**-ఆకునూరి మురళీకృష్ణ**

అక్కడ ఉన్న వాళ్లంతా దేవకి మాటలు విని ఆశ్చర్యంతో నోరు వెళ్ల బెట్టారు. ఆమె వెలిబుచ్చిన అభిప్రాయానికే కాకుండా అంత ధైర్యంగా అందరి ముందూ నిస్సంకోచంగా తన అభిప్రాయాన్ని చెప్పిన తీరుకి అంతా ఆశ్చర్యపోయారు.

తమలో చాలామందికి అలాంటి అభిప్రాయాలే ఉన్నా పైకి చెప్పడానికి మాత్రం ఎవరికీ ధైర్యం సరిపోదు. మహా అయితే ఇద్దరు ముగ్గురు కలసి చాటుగుండా తిట్టుకుంటూ ఉంటారు. అలాంటి వాళ్లందరికీ దేవకి ఒక అద్భుతంలా కనబడింది. మొట్టమొదటి మీటింగ్‌లోనే అంత నిర్మొహమా టంగా సరిత చెప్పినదానికి 'నో' అని చెప్పగలిగిన ఆమె వంక ఆరాధనగా చూసారు.

సరిత దెబ్బతిన్నట్లు చూసిందొక్క క్షణం. ఆ అపార్ట్‌మెంట్ మహిళామండలిలో తన ప్రతిపాదనని కాదని మాట్లాడినవాళ్లని మొదటిసారిగా చూస్తోంది ఆమె. అదీ అంత బాహాటంగా.

దేవకి వంక అనునయంగా నవ్వుతూ చూసి అంది "ఇందులో మీరు పెద్దగా కష్టపడాల్సింది ఏమీ ఉండదండీ. మిగిలినవాళ్లందరూ కూడా మీకు సహాయం చేస్తారు. సగటున మూడు నాలుగు నెలలకొకసారి వస్తుందంతే మీ వంతు. ఈ ఏర్పాటు సరదాగా వారినికోసారి మనమంతా కలుసుకోవడానికే తప్ప దాన్నేమీ పెద్ద మీటింగ్ అనుకోవక్కర్లేదు. అలా కలుసుకోవడంవల్ల మన మధ్య స్నేహం బలపడుతుంది. ఒకరి సమస్యలు ఒకరికి చెప్పుకుని మనసు విప్పి మాట్లాడుకోవచ్చు. ఈ ఆధునిక జీవితంలో ఇలాంటివన్నీ మన మానసిక వత్తిడిని తగ్గిస్తాయని సైంటిస్టులు గోల పెడుతున్నారండీ టీవీలోనూ, పుస్తకాల్లోనూ."

దేవకికి నవ్వొచ్చిందామె మాటలకి. 'గోల పెడుతున్నది సైంటిస్టులు కాదండీ... సైకాలజిస్టులు' అందామనుకుని బాగుండదని ఊరుకుంది.

"మీరు చెప్పింది నిజమేననుకోండి... కానీ నా ఇబ్బందులు నాకున్నాయి. నేనూ మావారూ ఇద్దరూ ఉద్యోగస్తులం. వారమంతా ఉరుకులూ పరుగులూనూ. వారాంతంలో ఇద్దరికీ దొరికేది ఒకే ఒక సెలవుదినం. మిగిలిన రోజుల్లో అసలు మాట్లాడుకోవడానికే కుదరదు. ఆ ఒక్కరోజు మాతో మేము, మా పిల్లలతో గడపడానికే సరిపోతుంది. ఇంక ఇలాంటి మీటింగ్‌ల కోసం కేటాయించడానికి సమయమే సరిపోదు. ఇంక మీటింగ్‌ని హోస్ట్ చేయడం అంటే నావల్ల అయ్యే పనికాదు. అందుకే ముందే చెప్పేసాను" నవ్వుతూ చెప్పింది దేవకి.

ఈసారి ఆమె మాటలు సంజాయిషీ చెప్పుకుంటున్నట్లుగా ఉండడంతో కొంచెం ఊరట చెందినట్లుగా కనబడింది సరిత ముఖం.

"ఆ మాటకొస్తే మన అపార్ట్‌మెంట్‌లో సగం మంది ఉద్యోగాలు చేసుకునే ఆడవాళ్లమే. ఎవరికీ కుటుంబంతో గడపడానికి సమయం సరిపోదు. అలాగని స్నేహాలని వదిలేసుకుంటామా? వాళ్లతో సమంగా స్నేహితులతో కూడా గడపాలి. నామటుకు నేను స్నేహమంటే ప్రాణమిస్తాను" అంది.

"నిజమే... నాకూ ఎవరితోనైనా స్నేహం పెంచుకోవడం అంటే చాలా ప్రీతి. మనిషికుండే మంచి స్నేహితుల్నిబట్టి అతని అదృష్టాన్ని లెక్కించవచ్చునని నాకు తెలుసు. అందుకే మీ అందరితో పరిచయం చేసుకోవాలని మీరు పిలవగానే ఈ మీటింగ్‌కు వచ్చాను. కానీ స్నేహమంటే మీరను కుంటున్నట్లు కేవలం మితిమీరిన పరిచయం మాత్రమే కాదు, అది ఒక హృదయ స్పందన అని నా అభిప్రాయం" అంది దేవకి.

"బానే వుంది. అస్తమానం కలుసుకోకపోతే స్నేహాలెలా పెరుగుతాయి? వారం అంతా అందరూ బిజీ. ఒక్క ఆదివారం మాత్రమే మనకి కొంచెం ఖాళీ దొరికేది. ఆ రోజు కూడా కలుసుకోకపోతే మనం ఎప్పటికీ ఒకరికొకరం కొత్తవాళ్లలాగే ఉండిపోతాం. ఎప్పుడైనా బయటకి వెళ్లేటప్పుడో వచ్చేటప్పుడో కలుసుకుంటే పలకరించుకోవాలంతే. ఈ లెక్కన మీరిక్కడ వుండే మూడునాలుగేళ్లలోనూ మనం మహా అయితే కొన్నిసార్లు లిఫ్టులో కనబడి నవ్వుకుంటాం. ఇంకొన్నిసార్లు కారిడార్లో కనబడి 'బాగున్నారా' అనుకుంటాం. ఆ మాత్రాన్నే స్నేహం అందామా?" నవ్వింది సరిత.

ఆమె మాటలకి సరితతోపాటు మిగిలిన అందరూ కూడా నవ్వారు.

దేవకి ఏమీ మాట్లాడలేదు. తను చెప్పిన సమాధానం అక్కడ ఒక డిబేట్‌కి దారి తీస్తోందన్న విషయం గమనించి వాతావరణాన్ని తేలిక చేయాలనుకుంది.

"సరే మీరు చెప్పిందానికి కూడా అంగీకరిస్తున్నాను. నాకు వీలయినప్పుడల్లా మీటింగ్‌కు వస్తాను. నా వీలునుబట్టి హోస్ట్ చేస్తాను. బలవంతం చేయకూడదు నన్ను" అంటూ అప్పటికి బయటపడింది.

సరిత అందరివంకా గర్వంగా చూసింది.

టాపిక్ పల్చబడడంతో అంతా మామూలు కబుర్లలో పడ్డారు. కుట్లు, అల్లికలు , వంటలు, టీవీ సీరియల్స్, ఫ్యాషన్లు ... ఆడవాళ్లకు అంతకన్నా కబుర్లు ఉండవన్నట్లుగా.

దేవకి అక్కడ ఉన్న కాసేపూ ముళ్లమీద కూర్చున్నట్లు కూర్చుంది. స్వతహాగా తన మనస్తత్వానికి అలాంటి సమావేశాలు పడవు.

ఒక గమ్యం లేకుండా ఏమాత్రం ప్రయోజనం లేని ఆ కబుర్లని స్నేహమంటారేమో ఆమెకి తెలియదు.

కొత్త ఊరు కదా మహిళామండలి మీటింగ్‌కి వెళ్తే అపార్ట్‌మెంట్‌లో అందర్నీ ఒకేసారి పరిచయం చేసుకోవచ్చునని వచ్చింది.

అక్కడి వాతావరణాన్ని చూసాక ఎంతో అవసరమైతేతప్ప మళ్లీ ఆ మీటింగ్‌లకి రాకూడదనుకుంది.

మీటింగ్‌ని ఆ వారం హోస్ట్ చేసిన ప్రియంవద గారు అందరికీ స్నాక్స్, పానీయాలు సరఫరా చేసారు. కాసేపు ఆవిడ స్వయంగా తయారుచేసిన స్నాక్స్‌మీద అందరి వ్యాఖ్యానాలు...



"ప్రియంవద గారికి వంటలో టాలెంట్ ఉన్నట్లే మనలో చాలామందికి చాలా విషయాల్లో టాలెంట్ ఉంది. ఇవన్నీ బయట ప్రపంచానికి తెలియాలంటే మనం మన మీటింగ్‌కి ఒకసారి టీవీ వాళ్లని పిలవాలి. ఈమధ్య అన్ని టీవీల వాళ్లూ ఇలాంటి ప్రోగ్రాములు వేస్తున్నారు. దేవకిగారు జర్నలిస్టు కనుక వాళ్లతో పరిచయాలు ఉండి ఉంటాయి. ఆవిడేమైనా సహాయం చేస్తారేమో ఈ విషయంలో" అంటూ దేవికివైపు చూసింది.

'టాలెంట్ అన్నది అభిరుచినిబట్టి వస్తుంది. మనలో నిజంగానే ఆ అభిరుచి ఉంటే మన టాలెంట్‌కి పరమావధి కేవలం మనం కాస్సేపు ఒక చిన్న టీవీ ప్రోగ్రాంలో కనబడడం కాకూడదు' అందామనుకుంది దేవకి తన సహజ ధోరణిలో. మళ్లీ ఇందాకటిలా అక్కడ అదొక చర్చనీయాంశం అవుతుందేమోనన్న భయంతో "ప్రయత్నిస్తాను" అని ఊరుకుంది.

మరి కాసేపు కబుర్లు చెప్పుకున్నాక ఆ రోజుకి మీటింగ్ అయిపోయింది.

'హమ్మయ్య' అనుకుని ఇంటికి నడిచింది దేవకి ఆనందంగా.

★★★

రోజులు గడుస్తున్నాయి. సరిత చెప్పినట్లుగానే వాళ్లందరినీ కారిడార్లోనో, లిఫ్టులోనో కనబడితే పలకరించడం తప్ప వాళ్లతో స్నేహం ముందుకు వెళ్లలేదు దేవకికి.

ఒకటి రెండు ఆదివారాలు మీటింగ్‌లకి రమ్మని సరిత కబురు పెట్టిందికానీ ఏవో పనులున్నాయన్న వంక పెట్టి తప్పించుకుంది దేవకి. దాంతో వాళ్లూ ఆమెని రెగ్యులర్‌గా పిలవడం మానేసారు. ఎప్పుడైనా తీరిక దొరికినప్పుడు మీటింగ్ ఎవరింట్లోనో కనుక్కుని తానే వెళ్తోంది.

ఎప్పుడు వెళ్లినా అవే కబుర్లు...అవే మాటలు. ఒక లక్ష్యం అంటూ లేకుండా సాగే వారి సంభాషణ తనకి బోర్‌గా అనిపిస్తోంది. అలా కాకుండా అంతమంది అక్కడ కలుసుకున్నందుకు ఒక ప్రయోజనం ఉండేలా ఆ సమావేశం జరిగి ఉండి ఉంటే బాగుండుననిపిస్తోందామెకి.

అదే మాటని ఒకసారి సరితతో అంది.

దానికి సరిత తేలిగ్గా నవ్వేసింది.

"మీరు జర్నలిస్టు కనుక మీకలా అనిపిస్తోందేమో... జీవితంలో ఎప్పుడూ లక్ష్యాలు ప్రయోజనాలే కాకుండా కాసింత రిలాక్సేషనూ అవసరమే. మన మంతా ఇలా కలసిమెలసి ఉండడంవల్ల మనందరికీ కామన్‌గా ఎన్నో ప్రాబ్లమ్స్‌ని సాల్వ్ చేసుకోగలుగుతాం. మనలో ఎవరికే కష్టమొచ్చినా మేమున్నామంటూ అందరం నిలబడుతున్నాం. అది చాలదా? అయినా ఒక లక్ష్యం కోసమో, ప్రయోజనం కోసమో చేసేదాన్ని స్నేహమనరు"

ఆఖరి మాటలు అంటున్నప్పుడు ఆమె కంఠంలో ధ్వనించిన వెటకారానికి చుట్టూ వున్నవాళ్ల ముఖాల మీద సన్నటి చిరునవ్వు కనబడడం గమనించింది దేవకి.

సరితకి స్నేహితులెక్కువ. స్నేహానికి ప్రాణమిచ్చే మనిషిగా ఆమెకి మంచి పేరుంది అందరిలోనూ. ఆమెకున్న ఇమేజ్ తెలుసు కనుక ఇంకేం మాట్లాడలేకపోయింది దేవకి.

***

మీటింగ్‌లకి సక్రమంగా హాజరు కాకపోవడంవల్లా, ముఖ్యంగా తనింట్లో మీటింగ్‌ని ఎప్పుడూ హోస్ట్ చేయకపోవడంవల్లా దేవకికి సహజంగానే అందరిలోనూ కొంత చెడ్డ పేరు వచ్చింది.

అందరూ కలసి ఏర్పాటు చేసుకునే గెట్ టు గెదర్‌లకీ, పిక్నిక్‌లకీ కూడా పెద్దగా హాజరు కాదు.

అందుకే ఆమెకి నలుగురితోనూ కలవదనీ, ఒంటరి పక్షి అనీ, స్నేహం విలువ తెలియదనీ పేరు వచ్చేసింది. ఆ సంగతి చూచాయిగా గ్రహించినా అదేమీ పట్టించుకోకుండా తనకి వీలయినప్పుడల్లా వాళ్లు ఏర్పాటు చేసే మీటింగ్‌లకీ, పిక్నిక్‌లకీ వెళ్తూనే ఉంది. కనబడినప్పుడల్లా అందరినీ స్నేహంగా పలకరించడానికి ప్రయత్నిస్తూనే ఉంది.

***

ఇదిలా ఉండగా ఒక ఆదివారంనాడు ఆ రోజు మహిళా మండలి మీటింగ్ తన ఇంట్లో జరుపుతున్నానని అందరికీ దేవకి నుంచి ఆహ్వానం వచ్చింది.

"దేవకి మీటింగ్ హోస్ట్ చేయడమేమిటి?" అని సరితతోసహా అంతా ఆశ్చర్యపోయారు.

"ఏదో విశేషం ఉండే వుంటుంది" అనుకున్నారు.

అందరిలోనూ ఏదో తెలియని ఉత్సుకత.

నిర్ణయించిన సమయంకన్నా ముందే అంతా వచ్చేసారు.

"రండి...రండి" అందరినీ ఆహ్వానించింది దేవకి. ఎప్పుడుకన్నా కొంచెం సీరియస్‌గా ఉందామె వదనం. మీటింగ్‌కి కావాల్సిన ఏర్పాట్లన్నీ ముందే ఎంతో అనుభవమున్నదానిలా చేసేసుకుని ఉండడంతో అందరూ ఒక్కసారి వచ్చినా ఏ ఇబ్బందీ కలగలేదు.

"ముఖ్యంగా మిమ్మల్నందర్నీ ఒక సహాయం కోరడానికే ఈరోజు ఈ సమావేశం ఏర్పాటు చేసాను" అంది దేవకి అందరూ కూర్చున్నాక.

"అనుకున్నాను" లోగొంతుతో అంది సరిత తన చుట్టుపక్కల కూర్చున్న వాళ్లకి మాత్రం వినబడేలా.

వాళ్లంతా కిసుక్కుమని నవ్వారు.

అదేమీ పట్టించుకోకుండా దేవకి కొనసాగించింది.

"మీకు తెలుసు కదా నేను నాలుగురోజుల క్రితం రాజమండ్రి వెళ్లి నిన్ననే తిరిగివచ్చాను. వచ్చేటప్పుడు రైల్లో ఒక స్త్రీ పరిచయం అయింది. భర్త వేధింపులని భరించలేక ఇంట్లోంచి పారిపోయి వచ్చి రైలెక్కేసింది. ఎన్నాళ్లనుంచో ఆ శాడిస్ట్ వేధింపులని భరిస్తూ అతన్ని మార్చాలని నిరంతరం ప్రయత్నిస్తూ చివరికి అది సాధ్యం కాదని తేలిపోగా ఆ బాధల నుంచి తప్పించుకునే మార్గం లేక జీవితం మీద ఆశ చచ్చిపోక ఇంట్లోంచి వచ్చేసి రైలెక్కేసింది. ఆ సమయంలో ఆమె దగ్గర రిజర్వేషన్ టిక్కెట్ కూడాలేదు. నేనే టీసీతో మాట్లాడి ఫైన్ కట్టి రైల్లోంచి దింపెయ్యకుండా ఆపాను. ఈ ఊర్లో ఎక్కడికెళ్లాలో ఆమెకు తెలీదు. ఆమె స్నేహితురాలు ఒకామె ఉందిట. ఆమెనే నమ్ముకుని బయలుదేరింది. కానీ ఆ హడావుడిలో ఆమె అడ్రస్, ఫోన్ నెంబర్ పోగొట్టుకుందిట. ఆమె పరిస్థితి విని నాతో తీసుకువచ్చేసాను. చిన్నప్పుడు ఆర్థిక ఇబ్బందులవల్ల పెద్దగా చదువుకోలేదు. కానీ చాలా చురుకైన పిల్ల. మీ సహాయంతో ఆమెకొక దారి చూపించాలని నా కోరిక."

## గుర్తుల వెనుక కథలు

బంగారపు రోజా పూవు, ఒక కొమ్ము జంతువు యూనికార్న్, గెంతుతూ ఉన్న దుప్పి, భయంకరంగా చూస్తున్న గే, సింహము, బంగారపు ఎద్దు, దేవదూత మొదలైనవన్నీ జర్మనీ దేశపు నగరాలలో సాధారణంగా ఇండ్ల తలుపుల మీద కనిపించే గుర్తులు, చిహ్నాలు. కొన్ని శతాబ్దాల క్రితం వీధుల పేర్లుగానీ, ఇళ్ల నెంబర్లు గానీ ఉండేవి కావు. తలుపుల పైన పెట్టిన ఈ చిహ్నాలే ప్రయాణీకులకు ఇళ్ళను తెలుసుకోవడానికి సహకరించేవి. ప్రతీ చిహ్నానికి ప్రత్యేక కథ ఒకటి ఉంది. గుమ్మం మీద దేవదూత-ద్రాక్షపళ్ళు చిహ్నం ద్రాక్షసారా ఏడవ స్వర్గానికి తీసుకుని వెడుతుంది అనడానికి నిదర్శనం. షట్కోణ నక్షత్ర చిహ్నం విలాసానికి, వినోదానికి ప్రత్యేకం అని తెలియజేస్తుంది. దిఫాక్స్ (నక్క) కసాయి ప్రయాణీకులకు హాస్టల్. కిరీటం (ది క్రౌన్) రాజులకు ప్రత్యేకం. శక్తికి చిహ్నంగా వాడబడే ఈగిల్ అండ ఆర్చ్ చిహ్నం శ్రీమంతులకు విడిది. ఈ చిహ్నములు, గుర్తులు అన్నీ ఇనుముతో కాక కర్రతో చేయబడి ఉంటాయి. వీటిని ప్రభుత్వం వారి అంగీకారంతో ఉపయోగిస్తారు. ఇప్పుడు అలంకారాలుగా కనిపించినా పూర్వం వీటి విలువ ఉండేది.

## 13 నెంబర్ విశిష్టత

నెంబర్ 13కు శకునం పలికే అపూర్వశక్తి ఉందని విశ్వసించబడుతోంది. సోవియట్ ప్రధానమంత్రి కృశ్చేవ్ అక్టోబర్ 13, 1964న లియోనిడ్ బ్రెజ్నేవ్‌చే వెళ్లగొట్టబడ్డాడు. నెంబర్ 13 ప్రభావం వల్ల అమెరికా అంతరిక్ష యాన సాధనం అపోలో 13 1970లో ముక్కలు ముక్కలు అయిపోయింది. దీనిని అంతరిక్షంలోకి బ్లాస్ట్ ఆఫ్ చేసి పంపిన సమయం 13:13 గంటలు. తర్వాత ఏప్రిల్ 13న దాని విద్యుచ్ఛక్తి నిలిచిపోయింది. 1971 ఇంటర్నేషనల్ ఎవరెస్ట్ ఎక్స్‌పెడిసన్‌లో 13 దేశాలకు చెందిన పర్వతారోహకులు ఉన్నారు. ఇక శిఖరం 548 మీటర్ల ఎత్తున ఉంది అనగానే వీరంతా కార్యక్రమం విరమించుకోవాల్సి వచ్చింది. ప్రపంచ ప్రసిద్ధిపొందిన శిల్ప శాస్త్ర నిపుణుడు లెకోర్బ్‌సీర్ పంజాబులో చండీఘర్ నిర్మాణంలో 13 సెక్టార్‌ను పూర్తిచేయకుండా విరమించారు. నెంబర్ 13 అంటే అతడికి భయం. యునైటెడ్ స్టేట్స్‌లో ఎన్నో ఎయిర్‌లైన్స్‌లో 13వ నెంబర్ విమానం ఉండదు. విమానంలో అసలు 13వ నెంబర్ సీటు అసలు ఉండదు.

-బద్దిగం

దేవకి చెప్పిందాన్ని ఆశ్చర్యంగా విన్నారు అందరూ.

"దారినపోయేదాన్ని నెత్తిన పెట్టుకోవడం అంటే ఇదే" అనుకున్నారు కొంత మంది.

"ఆమెలో భయం గూడుకట్టుకుని ఉన్నా మనసులో జీవితం మీద ఆశ వుంది, ప్రేమ వుంది. ఎంతోమంది ఆడవాళ్లలా జీవితాన్ని తేలిగ్గా తీసుకుని ఆత్మహత్య చేసుకోలేదు. ఎన్ని ఇబ్బందులు పడినా సరే తన కాళ్లమీద తను నిలబడి బ్రతకాలన్న తపన వుంది. జీవితానికో సార్థకత కల్పించుకోవాలన్న ఆశ వుంది. అదే నన్ను కట్టిపడేసింది. ఆమెకి ప్రస్తుతం కావాల్సింది కొంత నమ్మకం, కొంచెం ఆసరా. మనం ఇంతమంది ఉన్నాం. సాటి స్త్రీ కోసం ఆమాత్రం చేయలేమా?" అర్థిస్తున్నట్లుగా అంది.

ఆమె మాటలకి అందరిలోనూ చిన్న కదలిక.

"ఈ రెండురోజుల్లోనూ ఆమెతో మాట్లాడాక ఆమెకి భాషమీద పట్టు, మంచి భావ వ్యక్తీకరణ శక్తి ఉన్నాయని అర్థమైంది నాకు. అందుకే కొన్ని సబ్జెక్టులిచ్చి చిన్న చిన్న వ్యాసాలు రాయమన్నాను మా పత్రిక కోసం. కానీ కేవలం వాటితోనే ఆమె జీవితం గడవడం కష్టం. మీలో ఎవరైనా మీకు తెలిసివున్నవాళ్ల ద్వారా ఆమెకో చిన్న ఉద్యోగం ఇప్పించగలిగితే బావుంటుంది. అలాగే ప్రస్తుతం ఖాళీగా ఉన్న మన పెంట్‌హౌస్‌లో ఆమెకి కొంతకాలం ఉండడానికి అనుమతి కావాలి. అన్నింటికన్నా ముఖ్యంగా ఆమెకి జీవనపోరాటం కొనసాగించడానికి ధైర్యాన్ని ఇవ్వడానికి మీ అందరి స్నేహం కావాలి. మనం చేసే ఈ చిన్న చిన్న సహాయాలవల్ల ఒక జీవితం నిలబడుతుంది. ఆలోచించండి. మనం ఆమాత్రం చేయలేమా?"

ఈసారి ఆమె మాటలు అందరిలోనూ ఎంతో ఉద్వేగాన్ని కలిగించాయి. అంతకుముందు మీటింగ్‌లలో ఎప్పుడూ కలగని ఉద్వేగం.

"చెయ్యగలం...తప్పకుండా చేద్దాం" అన్నారు మనస్ఫూర్తిగా.

"గుడ్. ఆ నమ్మకంతోనే ఆమెని నాతో తీసుకుని వచ్చాను" అంది దేవకి సంతోషంగా.

"ఇంతకీ ఆమెని మాకు పరిచయం చేయలేదేం?" అడిగారు అంతా. అందరికీ ఆమెని చూడాలని కుతూహలంగా ఉంది.

"ఇప్పుడే పిలుస్తాను" అంటూ అప్పటిదాకా గెస్ట్‌రూంలో మౌనంగా కూర్చునివున్న ఒకామెని తీసుకువచ్చి అందరికీ పరిచయం చేయబోయింది దేవకి.

"సింధూరా!" అంటూ ఆమెని చూడగానే అవాక్కయి లేచి నిల్చుంది సరిత.

అందరూ విస్తుపోయారు.

"ఈమె మీకు ముందే తెలుసా?" అన్నారు ఆశ్చర్యంగా.

ఆమె కూడా సరితను చూస్తూనే "సరితా... నువ్విక్కడ..." అంది ఉద్వేగంతో మాటలు రానట్టు.

ఆ తరువాత వాళ్ల మాటలవల్ల అందరికీ అర్థమయింది సరితే, సింధూర స్నేహితురాలని, ఆమె అడ్రస్, ఫోన్ నెంబర్లే హడావుడిలో సింధూర పోగొట్టుకుందని.

"విధి ఎంత చిత్రమైనది?" అనుకున్నారు.

తేరుకున్నాక అందరూ సింధూరకి ధైర్యం చెప్పి ఆమె జీవితం గురించిన భవిష్యత్ ప్రణాళికలు రూపొందడంలో నిమగ్నమయ్యారు.

***

"ఆరోజు దేవకిగారే రైల్లో కనిపించకపోతే నా బ్రతుకు ఏమైపోయి ఉండేదో ఊహించుకోవడానికే భయంగా ఉంది. ఆవిడతో నా పరిచయం కేవలం పదినిముషాలు మాత్రమే. ఆ పదినిముషాల పరిచయంలోనే ఎంతో గొప్ప స్నేహితురాలిగా నాకు ధైర్యాన్ని చెప్పి నన్ను తనతో తీసుకువచ్చారు. మీ అందరి గురించీ ఎంతో నమ్మకంగా చెప్పి నాకు తప్పకుండా ఒక దారి చూపిస్తారని చెప్పారు. ఇప్పుడు ఆవిడ నేను జీవితంలో మరిచిపోలేని మంచి స్నేహితురాలు నాకు" ఆరాధనగా చెబుతున్న ఆమెవైపు ఆలోచిస్తూ చూస్తోంది సరిత.

అంతకుముందు తన కష్టాలు తెలుపుతూ తనకి ఎన్నోసార్లు ఉత్తరాలు రాసింది సింధూర. ఎన్నోసార్లు ఫోన్లు చేసింది. ప్రతిసారీ తను విని ఊరుకుందే తప్ప ఎప్పుడూ ఆమెకామాత్రం ధైర్యాన్ని ఇవ్వలేకపోయింది. ఆమాత్రమేనా సహాయం చేయాలన్న ఆలోచన తనకి రాలేదు.

"స్నేహమంటే మితిమీరిన పరిచయం మాత్రమేకాదు, అది ఒక హృదయ స్పందన" మొదటిరోజు మీటింగ్‌లో దేవకి అన్న మాటలు గుర్తుకొచ్చాయామెకి. క్రమంగా ఆమె ముఖం మీద చిరునవ్వు చోటుచేసుకుంది.

దేవకి స్ఫూర్తితో తమ మహిళామండలి కార్యక్రమాల్లో చేయవలసిన మార్పుల దిశగా ఆమె ఆలోచనలు సాగుతున్నాయి.

★

## శాఖాహారం మేలు

సౌతాంప్టన్‌లో జరిగిన ఓ సర్వేలో మాంసాహారులకన్నా శాఖాహారుల ఐ.క్యూ (తెలివితేటల స్థాయి) ఎక్కువని వైద్య నిపుణులు అంటున్నారు. 20 సంవత్సరాలపాటు ఎనిమిదివేలమంది వాలంటీర్లని స్టడీ చేసాక మాంసాహారులకంటే పళ్లు, కూరలు ఎక్కువగా తినే శాఖాహారులకి జ్ఞాపకశక్తి, చురుకుదనం ఎక్కువగా ఉండడం, వాళ్ల బిపి, కొలెస్ట్రాల్‌లాంటివి తక్కువగా ఉండడం ఈ సర్వేలో తేలినట్లు బ్రిటిష్ మెడికల్ జర్నల్‌లో డేటాతోసహా ప్రచురించారు.

## వర్షంలో పాట్లు

నార్ఫాక్‌లో పాటర్ ఫస్ట్ స్కూల్లో ప్రైమరీ క్లాసు పిల్లలు ఆడుతూ పాడుతూ బయట గడపడంవల్ల ఉల్లాసంగా ఉంటున్నారని, స్వచ్ఛమైన గాలి పీల్చడంవల్ల ఆరోగ్యంగా ఉంటున్నారని, పాఠాలమీద ఏకాగ్రత కలిగి ఉంటున్నారని, వాళ్ల జ్ఞాపకశక్తి పెరుగుతోందని, అందుచేత బయట వాతావరణం ఎలా ఉన్నా సరే చివరికి వర్షం కురుస్తున్నా రోజులో సగం క్లాసుల్ని నడుపుతున్నారట. వాళ్లకి జంప్ సూట్స్ ఇవ్వడంవల్ల వర్షం, చలి, ఎండ అన్నవి పిల్లలను ఏమీ చేయడంలేదుట.

## అనాగరికుల రాజధాని

ఢిల్లీ మెట్రో రైలు రాజధానికి గర్వకారణం. కానీ నగరం నిండా అనాగరికులమయం. వారి నిర్వాకం వల్ల మెట్రో రైళ్లు, స్టేషన్లు ఛండాలంగా తయారవుతున్నాయి. ప్రయాణీకులు అంటించే చూయింగ్ గమ్స్, పారేసిన చెత్త, ఉమ్ముల మరకలు వదిలించి రైళ్లని, స్టేషన్‌లను శుభ్రం చేయడానికి ప్రతి రాత్రి మూడుగంటలపాటు 65 మంది పనివాళ్లు ఏకధాటిగా పని చేయాల్సి వస్తోందిట. దీనికి మెట్రోవారికి ప్రతి స్టేషన్‌కి రెండులక్షలు, ప్రతి రైలుకు 30 వేలు ఖర్చవుతోందిట. ఇది చాలా అనాగరికమని ప్రకటనల ద్వారా, వీధి నాటకాల ద్వారా స్థానికుల్ని విద్యావంతులను చేయాలని మెట్రోవారు నానా తంటాలు పడుతున్నారు.

-తటవర్తి